# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-05-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రైతుల పంట ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరవేసేలా "పొలం నుండి ఇంటికి" విధానాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు.**

3. **సొంత ఆదాయ వనరులు పెంపొందించుకోవడం ద్వారా పంచాయతీలు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.**

4. **ఆరోగ్య రంగంలో ఏఐ ఆధారిత సాంకేతికత వినియోగాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ తెలిపారు.**

==========================

రైతులు పండించే కూరగాయలు, పండ్లను నేరుగా వినియోగదారుల ఇళ్లకు చేరవేసేలా "పొలం నుండి ఇంటికి" విధానాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌లో కొత్త వ్యూహాలు అమలు చేయాలని సూచించారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడంతో పాటు రైతులకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూసార పరీక్షల వివరాలను రైతులకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని, వ్యవసాయ యాంత్రీకరణను విస్తరించాలని సూచించారు.

-------------------------

ప్రభుత్వంలోని అన్ని శాఖల ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీన జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాల కోసం ప్రతి నెలా ప్రత్యేకంగా 50 కోట్ల రూపాయలు మంజూరు చేస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీల ఆదాయాన్ని బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధంగా చట్ట సవరణలు చేపట్టాలని

రేవంత్ రెడ్డి సూచించారు.

---------------------------

సొంత ఆదాయ వనరులు పెంపొందించుకోవడం ద్వారా పంచాయతీలు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గ్రామీణ మండలం రాజోలు గ్రామపంచాయతీలో పన్నుల ఆన్ లైన్ వసూలు విధానాన్ని ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, పాలనలో సాంకేతికత వినియోగంతో పారదర్శకత పెరుగుతుందని చెప్పారు. ప్రజల నుంచి వసూలు చేసే ప్రతి రూపాయిని పారదర్శకంగా వినియోగిస్తామని తెలిపారు.

---------------------------

బుడమేరు వరద ముంపు నుంచి విజయవాడ నగరాన్ని రక్షించే చర్యల్లో భాగంగా ఎనికేపాడు వద్ద భూగర్భ సొరంగం సామర్థ్యాన్ని పెంచుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ఎనికేపాడు వద్ద బుడమేరు డ్రైన్‌పై జరుగుతున్న భూగర్భ సొరంగం నిర్మాణ పనులను మంత్రి నిన్న పరిశీలించారు. బుడమేరు డైవర్షన్ కాలువ సామర్థ్యాన్ని 37 వేల 500 క్యూసెక్కులకు పెంచేలా 120 కోట్ల రూపాయలతో లైనింగ్ పనులు కొనసాగుతున్నాయని పేర్కొంటూ ...

వాయిస్..30.. సెకన్లు

---------------------------

కొత్త సాంకేతికతలపై యువత అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ లబ్బీపేటలో నిర్వహించిన "కనెక్ట్ ఏపీ ఎక్స్‌పో" కార్యక్రమంలో ఆయన నిన్న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ కేబుల్ ఆపరేటర్లు, ఓటిటి, ఇంటర్నెట్, డ్రోన్ హార్డ్ వేర్ రంగాలకు చెందిన సంస్థలను ఒకే వేదికపైకి తీసుకురావడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఇలాంటి ఎక్స్ పోల ద్వారా ప్రజల్లో సాంకేతిక అవగాహన పెరగడంతో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని తెలిపారు.

---------------------------

ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధస్సు –ఏఐ ఆధారిత సాంకేతికత వినియోగాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్వహించిన "ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థలు – వ్యూహాత్మక వాటాదారుల భాగస్వామ్య కార్యశాల, మెడ్‌టెక్ ఛాలెంజ్" కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించడంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. మెడ్‌టెక్ రంగంలో ఆవిష్కరణలు, డిజిటల్ హెల్త్ పరిష్కారాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని మంత్రి తెలియజేశారు.

---------------------------

గత పన్నెండు సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలు తమ జీవన ప్రమాణాలను మెరుగుపరిచాయని తిరుపతి జిల్లాకు చెందిన లబ్ధిదారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ

పథకాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకున్నామని వారు పేర్కొన్నారు. పీఎం కిసాన్ పథకం రైతులకు ఆర్థికంగా మేలు చేసిందని తిరుపతికి చెందిన అమరనాథ్ పేర్కొన్నారు.

వాయిస్..30.. సెకన్లు

అలాగే ముద్ర లోన్ పథకం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పెరిగాయని లబ్ధి పొందిన ఇందిర తెలిపారు.

వాయిస్ ..25..సెకన్లు

---------------------------

రైతులు పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. పంట వ్యర్థాలను దగ్ధం చేయడం వల్ల భూసారం దెబ్బతిని నేలలోని పోషకాలు తగ్గిపోతాయని మంత్రి నిన్న ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఉపగ్రహ సాంకేతికత ద్వారా పంట అవశేషాల దహనాన్ని గుర్తిస్తున్నామని తెలిపారు. పంట అవశేషాలను కాల్చినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని, నిర్లక్ష్యం వహించే అధికారులపై కూడా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

---------------------------

భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య పోరాటంలో జాతిపిత మహాత్మాగాంధీతో పాటు ప్రముఖపాత్ర వహించిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి ఈరోజు. తొలి ప్రధానమంత్రిగా దేశ పురోగతికి ఆయన పటిష్ఠమైన పునాది వేశారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను ప్రజలు స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పిస్తున్నారు.

---------------------------

ఎండల తీవ్రత కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. నిన్న గుంటూరు జిల్లా ములుకుదురులో 47. 7 డిగ్రీలు, పల్నాడు జిల్లా గురజాలలో 47. 6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వెల్లడించారు. 14 జిల్లాల్లోని 125 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. ఈరోజు 68 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 93 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

తెలంగాణలోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాల్లో 42 నుంచి 45 కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

=====================